www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 143 | హైదరాబాద్ | సోమవారం 11-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## వర్షం తగ్గిన వెంటనే బయటకు రావొద్దు



**హైదరాబాద్ ఆగస్టు 10 (సిద్దిపేట పవర్):**

వర్షాల నేపథ్యంలో భాగ్యనగర ప్రజలు ప్రజారవాణాను ఎక్కువగా ఉపయోగించుకుంటే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. నగరంలో ఆకస్మికంగా భారీ వర్షాలు పడుతున్నాయని, వర్షం తగ్గగానే అందరూ ఒకేసారి రోడ్ల మీదకు రావడంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతోందని అన్నారు.

''వర్షం తగ్గాక అందరూ ఒకే సారి కాకుండా కొంత సమయం తీసుకొని రోడ్లమీదకు వస్తే మంచిది. వరద సమస్యను పరిష్కరించేందుకు అధికారులందరూ శాయశక్తులా కృషి చేస్తున్నారు. ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాల్సిన అవసరం ఉంది. ప్రజా సమస్యలపై గతంకంటే వేగంగా స్పందిస్తున్నాం. వరద నీరు భూమిలోకి ఇంకిపోయే చర్యలు కూడా ప్రజల నుంచి పెరగాలి. అపార్ట్‌మెంట్ వాసులు ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం''అని మంత్రి పొన్నం చెప్పారు.

## చిన్న పట్టణాలకూ ఐటీ...

- ఆదిలాబాద్ ఐటీ టవర్ నిర్మాణంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ స్పందన
- చిన్న పట్టణాలకు కూడా ఐటీ విస్తరణను కొనసాగించాలని ప్రభుత్వానికి సూచన
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే టైర్2 నగరాల్లో ఐటీ హబ్‌లకు శ్రీకారం
- స్థానిక యువతకు ఉద్యోగాలే లక్ష్యంగా ఐటీ టవర్ల నిర్మాణం



**హైదరాబాద్ ఆగస్టు 10 (సిద్దిపేట పవర్):**

చిన్న పట్టణాలకు ఐటీ రంగాన్ని విస్తరించే విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన కృషిని కొనసాగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు.

ఆదివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందిస్తూ, "కేసీఆర్ ప్రభుత్వ హయాంలో టైర్ 2 నగరాలకు ఐటీని తీసుకెళ్లడం మా ప్రాధాన్యతగా ఉండేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి కృషి చేస్తుందని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, సిద్దిపేటతో పాటు ఆదిలాబాద్‌లోనూ ఐటీ హబ్‌లను ప్రారంభించామని ఆయన గుర్తుచేశారు. చిన్న, మధ్య తరహా ..మిగతా 2లో

## 'ఓట్ చోరీ' వెబ్ సైట్ ఆవిష్కరించిన రాహుల్ గాంధీ

- ఈసీఐకి వ్యతిరేకంగా 'ఓట్ చోరీ' పేరుతో రాహుల్ గాంధీ ప్రచారం
- డిజిటల్ ఓటర్ల జాబితా విడుదల చేయాలని డిమాండ్
- ప్రజల మద్దతు కోసం ప్రత్యేక వెబ్‌సైట్, మిస్డ్ కాల్ నంబర్ విడుదల
- సోమవారం ఈసీఐ కార్యాలయానికి ఇండియా కూటమి ఎంపీల నిరసన ర్యాలీ
- రాహుల్ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన ఎన్నికల సంఘం
- ఇండియా కూటమి ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విందు


2

## ఇచ్చేటోడు ఇవ్వడు... అడిగేటోడు అడగడు

వితంతువులను వృద్ధులను ఒంటరి మహిళలను మోసం చేసిన... కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ


2

## ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సీఎం

- హైదరాబాద్‌లో భారీ వర్షా లతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- ముంపు ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటన
- అమీర్‌పేట్ గంగుబాయి బస్తీ, బుద్ధ నగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన
- స్థానికులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి
- సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ యంత్రాంగం సూచన


2

## ఫాస్టాగ్ వన్ ఇయర్ పాస్...

- ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్ అమలు
- రూ. 3,000 చెల్లిస్తే ఏడాది లేదా 200 ట్రిప్పుల వ్యాలిడిటీ
- కేవలం ప్రైవేట్ వాహనాలకు మాత్రమే వర్తింపు
- జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై మాత్రమే చెల్లుబాటు
- రాష్ట్ర రహదారులపై ఈ పాస్ పనిచేయదు
- రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కొనుగోలు




2

## జర్మనీ ఫీజులో మర్మం?.. ఉచిత విద్య ఉండగ.. 21 లక్షల ఫీజు దండగ?

ఉచిత విద్యకు జర్మనీ కేరాఫ్ అడ్రస్. అక్కడ అత్యధికం పబ్లిక్ యూనివర్సిటీలే ఉంటాయి. వాటిలో ట్యూషన్ ఫీజు కింద రూపాయి కూడా తీసుకోరు. అంతర్జాతీయ విద్యార్థుల నుంచీ వసూలు చేయరు. కొన్ని వర్సిటీలు రిజిస్ట్రేషన్, అడ్మినిస్ట్రేటివ్ అవసరాల కోసం గరిష్ఠంగా రూ.300 -500 యూరోలు వసూలు చేస్తుంటాయి.

- డమ్మీ వర్సిటీ.. ఫేక్ కోర్సులు?
- జేఎన్టీయూ-జర్మనీ ఒప్పందం వెనుక దందా
- ఉచిత విద్యకు కేరాఫ్‌గా నిలుస్తున్న జర్మనీ
- పబ్లిక్ వర్సిటీలు వదిలి ఫౌండేషన్‌తో ఒప్పందం
- వసూళ్లలో ఎవరి వాటా ఎంత? అని ప్రశ్నలు
- ఫిర్యాదు చేసినా వర్సిటీ మౌనంపై అనుమానాలు

ప్రస్తుతం 40 వేల మంది భారతీయ విద్యార్థులు అక్కడ చదువుకుంటున్నారు. జర్మనీలో ఇలా ఉచిత విద్య అందుబాటులో ఉన్నా జేఎన్టీయూ మాత్రం రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నది. ఫీజులే తీసుకోని దేశంలో ఊరూపేరూలేని సంస్థలతో ఒప్పందం చేసుకొని, కోర్సులు ఆఫర్ చేస్తూ, రూ.21 లక్షల ఫీజు వసూలు చేయడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.




**హైదరాబాద్ ఆగస్టు 10 (సిద్దిపేట పవర్):**

జేఎన్టీయూ ఆఫర్ చేస్తున్న రెండు జర్మన్ కోర్సుల ఫీజులు చూస్తే జడుసుకోవాల్సిందే. వాస్తవానికి రోట్లింజన్ హోప్ షూ లే యూనివర్సిటీలో సెమిస్టర్‌కు 1,500 యూరోలు (దాదాపు రూ.లక్షన్నర) ..మిగతా 2లో

## జనసేన కేంద్ర కార్యాలయంలో ల్యాండ్ అయిన తెలంగాణ మంత్రులు

- ప్రైవేటు కార్యక్రమం కోసం మంగళగిరి వచ్చిన తెలంగాణ మంత్రులు
- జనసేన పార్టీ కార్యాలయం హెలిప్యాడ్‌లో దిగిన హెలికాప్టర్
- ఉప ముఖ్యమంత్రి భట్టి బృందానికి పవన్ కల్యాణ్ తరపున స్వాగతం
- స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ హరిప్రసాద్
- తిరుగు ప్రయాణంలో మంత్రులకు కొండపల్లి బొమ్మలు బహూకరించిన జనసేన నేతలు
- భట్టితో పాటు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి తదితరుల హాజరు



**మంగళగిరి ఆగస్టు 10 (సిద్దిపేట పవర్):**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణానికి అద్దం పట్టే ఆసక్తికర పరిణామం ఆదివారం మంగళగిరిలో చోటుచేసుకుంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో మంగళగిరి వచ్చారు. వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ నేరుగా జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ..మిగతా 2లో

## బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- కాషాయ దళంలో చేరిన గువ్వల బాలరాజు
- హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కండువా కప్పి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర చీఫ్
- గువ్వలతో పాటు మరికొందరు నియోజకవర్గ నేతలు కూడా బీజేపీలో చేరిక
- బీఆర్ఎస్‌లో సరైన గుర్తింపు లేదనే అసంతృప్తితో ఉన్న గువ్వల
- ఆయన చేరికతో తమ పార్టీ మరింత బలపడుతుందన్న బీజేపీ నేతలు
- కొద్దిరోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఊహాగానాలకు ముగింపు


2

**హైదరాబాద్ ఆగస్టు 10 (సిద్దిపేట పవర్):**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరారు. ఆదివారం నాడు హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బాలరాజుకు కాషాయ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గువ్వలతో పాటు ఆయన

## రాయలసీమ ఎత్తిపోతల పూర్తయితే ఖమ్మం, నల్గొండ ఎడారులే

అందుకే బనకచర్ల ఆగిపోయింది. భట్టి విక్రమార్క

- రాయలసీమలో లిఫ్ట్ పూర్తి అయితే నల్గొండ, ఖమ్మం జిల్లాలకు భారీ నష్టం
- రాయలసీమ లిఫ్ట్‌ను ఆపేయాలి
- కృష్ణా జలాలను తెలంగాణ 1 టీఎంసీ వాడుకుంటే.. ఏపీ 11 టీఎంసీలు వాడుకుంటోంది
- అదే జరిగితే శ్రీశైలం ఖాళీ అవుతుంది
- సీఎం రేవంత్, ఉత్తమ్ ఇద్దరూ బనకచర్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారు


3

## 'ఓట్ చోరీ' వెబ్ సైట్ ఆవిష్కరించిన రాహుల్ గాంధీ

- **ఈసీఐకి వ్యతిరేకంగా 'ఓట్ చోరీ' పేరుతో రాహుల్ గాంధీ ప్రచారం**
- **డిజిటల్ ఓటర్ల జాబితా విడుదల చేయాలని డిమాండ్**
- **ప్రజల మద్దతు కోసం ప్రత్యేక వెబ్‌సైట్, మిస్డ్ కాల్ నంబర్ విడుదల**
- **సోమవారం ఈసీఐ కార్యాలయానికి ఇండియా కూటమి ఎంపీల నిరసన ర్యాలీ**
- **రాహుల్ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన ఎన్నికల సంఘం**
- **ఇండియా కూటమి ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విందు**



**న్యూఢిల్లీ ఆగస్టు 10 (సిద్దిపేట పవర్):**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లక్ష్యంగా తన విమర్శల దాడిని మరింత తీవ్రతరం చేశారు. డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న తన డిమాండ్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు 'ఓట్ చోరీ' పేరుతో నేడు ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, దానిని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ ప్రచారానికి సంబంధించి రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. "వోట్ చోరీని బహిర్గతం చేయడం చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. "దేశంలో జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని ఆపేందుకు ప్రారంభించిన ఈ ప్రచారానికి మనస్ఫూర్తిగా మద్దతివ్వండి. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటం" అని ఆయన అన్నారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు, పార్టీలు ఓటర్ల జాబితాను తనిఖీ చేసేందుకు వీలుగా ఈసీఐ పారదర్శకంగా వ్యవహరించి డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రచారానికి మద్దతుగా votechori.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 9650003420 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు.

గత 10 ఏళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వాటికి సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను అందించాలని ఆగస్టు 8న బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈసీఐని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అలా చేయడంలో విఫలమైతే, ఎన్నికల మోసాన్ని ఈసీఐ కప్పిపుచ్చినట్లే అవుతుందని, అది నేరంతో సమానమని ఆయన హెచ్చరించారు.

అయితే, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం "ఆధారరహితమైనవి"గా కొట్టిపారేసింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని ఈసీఐ స్పష్టం చేసింది.

ఈ నేపథ్యంలో, రేపు సోమవారం నాడు పార్లమెంట్ కాంప్లెక్స్ నుంచి ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ఇండియా కూటమి ఎంపీలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించడానికి రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నారు. ఈసీఐ అధికారులతో సమావేశం కోసం కూటమి నేతలు ఇప్పటికే సమయం కోరినట్లు సమాచారం. అదే రోజు రాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి ఎంపీలకు విందు ఇవ్వనున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఐక్యంగా పోరాడేందుకు విపక్షాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి.

# జర్మనీ ఫీజులో మర్మం?..
# ఉచిత విద్య ఉండగ..
# 21 లక్షల ఫీజు దండగ?

**మొదటిపేజీ తరువాయి**

ఫీజుగా తీసుకుంటున్నారు. నాలుగు సెమిస్టర్లకు కలిపి 6వేల యూరోలు (సుమారు రూ.6లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. కానీ జేఎన్టీయూ మాత్రం మొదటి సెమిస్టర్‌కు 3 వేల యూరోలు (దాదాపు రూ.మూడు లక్షలు), మిగతా మూడు సెమిస్టర్లకు 6 వేల యూరోల చొప్పున నాలుగు సెమిస్టర్లకు కలిపి 21 వేల యూరోలు వసూలు చేస్తున్నది. అంటే రోట్లింజన్ హోప్ షూలే కన్నా మూడున్నర రెట్లు ఎక్కువ. ఇది పెద్ద దందా అని, కన్సల్టెంట్లకు 15శాతం కమీషన్ కింద పోతున్నదని ఆరోపణలున్నాయి. ప్రవేశాల కోసం ప్రైవేట్ కన్సల్టెన్సీ ఎందుకు రంగంలోకి దిగింది? వంగపండు పాత్ర ఏమిటి? అన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.

**అక్కడ స్కాలర్‌షిప్‌లు కూడా..**

జర్మనీలో జీవన వ్యయం సంవత్సరానికి 12 వేల యూరోల లోపే. జర్మన్ అకాడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్ (డాడ్) ఏటా లక్ష మందికి స్కాలర్‌షిప్‌లు ఇస్తుంది. మాస్టర్ గ్రాడ్యుయేట్లకు 992 యూరోలు, డాక్టోరల్ కు 1300 యూరోలు స్కాలర్‌షిప్‌గా ఇస్తున్నారు. ఇందు లో భారతీయులు రెండోస్థానంలో ఉన్నారు. హాంబర్గ్, హంబోల్డ్ వంటి వర్సిటీలు ఇంటర్నేషనల్ స్కాలర్‌షిప్స్, రీసెర్చ్ ఫెలోషిప్స్ అందిస్తున్నాయి. ఉచిత విద్య అందించే, స్కాలర్‌షిప్‌లు ఇచ్చే విద్యాసంస్థలు ఉండగా, రూ.21 లక్షలు ఫీజు వసూలు చేసే ప్రైవేట్ సంస్థలతో ఒప్పందం ఎందుకన్నది నిపుణుల ప్రశ్న.

**అడుగడుగునా అనుమానాలే**

ఒక ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకుడు జేఎన్టీయూ క్యాంపస్‌లో చిన్న గది అద్దెకు తీసుకుని శిక్షణ ఇచ్చినంత మాత్రాన ఆ ట్రైనింగ్ సెంటర్ ఇచ్చే సర్టిఫికెట్ జేఎన్టీయూతో సమానం అవుతుందా? ఆ కోర్సులన్నీ జేఎన్టీయూ కోర్సులవుతాయా? జేఎన్టీయూ ఆచార్యులు జర్మనీకి వెళ్లి చేసిన ఒప్పందాలు కూడా ఇలాగే ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒప్పందం కుదుర్చుకున్న అకాడమీ రోట్లింజన్ యూనివర్సిటీలో భాగమే అయితే.. వర్సిటీ వెబ్‌సైట్‌లో ఆ అకాడమీ సీఈవో స్థాపించిన నాలెడ్జ్ ఫౌండేషన్ గుర్తించి ఎందుకు ప్రస్తావించలేదు? జేఎన్టీయూ, జర్మనీకి చెందిన ట్రైనింగ్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకుంటే దాని గురించి జేఎన్టీయూ, సదరు ట్రైనింగ్ సెంటర్ ప్రచారం చేయాలి. మధ్యలో 'వంగపండు' ఎందుకు? థర్డ్ పార్టీ 'వంగపండు' స్పెషల్ వీడియోలు చేయించి, సొంత ఫోన్ నంబర్లు ఇచ్చి మరీ ప్రమోట్ చేయాల్సిన పని ఏమిటని అడుగుతున్నారు. జేఎన్టీయూ వెబ్‌సైట్‌లోనే అడ్మిషన్స్ డైరెక్టర్ నంబర్లు ఇచ్చారు. ఆ నంబర్లను సంప్రదిస్తే ప్రైవేట్ వ్యక్తులు సమాధానం ఇస్తున్నారు.

**చర్చలకు ఎందుకు వెనుకడుగు?**

జర్మనీ సంస్థలతో జేఎన్టీయూ ఒప్పందాలపై కొందరు వర్సిటీకి ఫిర్యాదుచేశారు. జర్మనీ టాప్ 3 ర్యాంక్ విశ్వవిద్యాలయం అని చెప్పిన సంస్థ వేరని, ఒప్పందం చేసుకున్న రోట్లింజన్ వర్సిటీ వేరు అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజాలు నిగ్గు తేల్చేందుకు నిజమైన రోట్లింజన్ ఆచార్యులతో భేటీ అవుదామని ఆన్‌లైన్ మీటింగ్‌కు ఆహ్వానించారు. ఒప్పందం కుదుర్చుకున్న ప్రైవేట్ అకాడమీ సామర్థ్యం, సర్టిఫికెట్ల విలువపై చర్చించేందుకు అరగంట సమయమివ్వమంటే జేఎన్టీయూ వీసీ, అధికారులు ఒప్పుకోవడంలేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. మన దగ్గరి నుంచి వెళ్లే విద్యార్థుల్లో అత్యధికులు అప్పులు చేసి, ఆస్తులు కుదవపెట్టి వెళ్తుంటారు. రూ.21లక్షలు పెట్టిన చదువు, సర్టిఫికెట్ చెల్లుబాటుకాకపోతే విద్యార్థుల భవిష్యత్తు ఏమిటి? జర్మనీలోని కొన్ని ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఫీజులు మరీ భారీగా ఏం లేవు. జేఎన్టీయూ ఒప్పందం చేసుకున్న సంస్థకు ఎందుకింత ఫీజులు చెల్లించాలి? రూ.21లక్షల్లో జేఎన్టీయూ రూ.3 లక్షలు తీసుకోగా, మిగతా రూ. 18 లక్షలు జర్మనీ సంస్థలకు చెల్లిస్తామని చెప్తున్నారు. ఇప్పటివరకు జరిగిన పరిణామాలను బట్టి రూ.18 లక్షల్లో ఎవరి వాటా ఎంత? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.




## ఫాస్టాగ్ వన్ ఇయర్ పాస్..

- **ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్ అమలు**
- **రూ. 3,000 చెల్లిస్తే ఏడాది లేదా 200 ట్రిప్పుల వ్యాలిడిటీ**
- **కేవలం ప్రైవేట్ వాహనాలకు మాత్రమే వర్తింపు**
**జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై మాత్రమే చెల్లుబాటు**
- **రాష్ట్ర రహదారులపై ఈ పాస్ పనిచేయదు**
- **రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కొనుగోలు**

**హైదరాబాద్ ఆగస్టు 10 (సిద్దిపేట పవర్):**

వాహనదారులకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) ఒక శుభవార్త అందించింది. టోల్ ప్లాజాల వద్ద చెల్లింపులను మరింత సులభతరం చేసేందుకు 'ఫాస్టాగ్ వార్షిక పాస్'ను ప్రవేశపెట్టనుంది. ఈ కొత్త పథకం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15, 2025 నుంచి అందుబాటులోకి రానుంది. తరచుగా జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి పదేపదే రీఛార్జ్ చేసుకునే శ్రమను తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

ఈ వార్షిక పాస్ ధరను రూ. 3,000గా నిర్ణయించారు. ఈ మొత్తాన్ని చెల్లించిన ప్రైవేట్ వాహన యజమానులు ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు టోల్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుంది. ఈ పాస్‌ను కొనుగోలు చేయాలంటే వాహనానికి ఇప్పటికే ఫాస్టాగ్ యాక్టివ్‌గా ఉండాలి. 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్ లేదా NHAI అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అయితే, ఈ పాస్ కేవలం NHAI, కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై మాత్రమే చెల్లుబాటు అవుతుందని అధికారులు స్పష్టం చేశారు. ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే, సమృద్ధి మహామార్గ్, అటల్ సేతు వంటి రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని రహదారులపై ఈ పాస్ పనిచేయదు. అటువంటి మార్గాలలో ప్రయాణించేటప్పుడు ఫాస్టాగ్ వ్యాలెట్ నుంచి యథావిధిగా టోల్ రుసుము కట్ అవుతుంది.ఒక వాహనంపై తీసుకున్న పాస్‌ను మరో వాహనానికి బదిలీ చేయడానికి వీలుండదు. అలాగే, 200 ట్రిప్పులు లేదా ఏడాది గడువు ముగిసిన తర్వాత పాస్ గడువు ముగుస్తుంది. వినియోగదారులు కావాలనుకుంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పాస్‌కు ఆటోరెన్యూవల్ సౌకర్యం లేదు.




## జనసేన కేంద్ర కార్యాలయంలో ల్యాండ్ అయిన తెలంగాణ మంత్రులు

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది.

ఆదివారం ఉదయం జరిగిన ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి ఉన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తరపున శాసన మండలిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, ఇతర జనసేన నాయకులు తెలంగాణ మంత్రులకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వారంతా మంగళగిరిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు.

కార్యక్రమం ముగిసిన తర్వాత తెలంగాణ మంత్రులు తిరుగు ప్రయాణమయ్యేందుకు తిరిగి జనసేన కార్యాలయ ప్రాంగణానికి చేరుకున్నారు.



తిరుగు ప్రయాణంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా వారితో కలిశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా పంపిన, తెలుగు సంస్కృతికి ప్రతీకలైన కొండపల్లి బొమ్మల జ్ఞాపికలను తెలంగాణ మంత్రులకు బహూకరించి జనసేన నాయకులు వీడ్కోలు పలికారు.

## చిన్న పట్టణాలకూ ఐటీ...

**మొదటిపేజీ తరువాయి**

ఐటీ కంపెనీలకు ప్లగ్ అండ్ ప్లే సౌకర్యాలు కల్పించడం, స్టార్టప్ వాతావరణాన్ని ప్రోత్సహించడం, టాస్క్ కేంద్రాల ద్వారా నైపుణ్యాభివృద్ధి అందించడం తమ లక్ష్యమని వివరించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్ ఐటీ టవర్‌ను రూ. 40 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేసింది. నిర్మాణ వ్యయం రూ. 58 కోట్లకు పెరిగినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసి పనులను కొనసాగిస్తోంది. ఈ టవర్ పూర్తయితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. సుమారు 68,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ జీ+4 భవనంలో 635 మంది ఉద్యోగులు పనిచేసేందుకు వీలుంటుంది. మూడు షిఫ్టుల్లో కలిపి దాదాపు 1,900 మందికి ఉపాధి లభించనుంది.

టైర్2 నగరాల్లోని ఐటీ టవర్లలో పూర్తిస్థాయిలో కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించేలా చూసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. కంపెనీలను ఆకర్షించేందుకు మెరుగైన రోడ్లు, 24 గంటల విద్యుత్, ఫైబర్ కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐటీ అభివృద్ధిని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా, రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.



## ఇచ్చేటోడు ఇవ్వడు... అడిగేటోడు అడగడు

- **వితంతువులను వృద్ధులను ఒంటరి మహిళలను మోసం చేసిన... కాంగ్రెస్ ప్రభుత్వం**
- **ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 10 (సిద్దిపేట పవర్):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారంలో ఏర్పాటు చేసిన మహా గర్జన సన్నాహక సదస్సు సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోనే వితంతువులకు, వృద్ధులకు, చేయూతదారులకు 4000 , వికాంగులకు 6000, అంగవైకల్యం కలిగిన వికలాంగులకు 15000 ఇస్తానని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెన్షన్ దారులకు ఇచ్చిన హామీలు 20 నెలలు అవుతున్న అతి గతి లేదన్నారు. గెలిచి 20 నెలలైనా పెన్షన్ దారులను పట్టించుకోవడం లేదని, అటు ప్రతిపక్షం కూడా నోరు మెదపడం లేదన్నారు. వృద్ధులను, వితంతువులను, ఒంటరి మహిళలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తగిన గుణపాఠం చెప్తామన్నారు. రాష్ట్రంలో 50 లక్షల మంది వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు ఉన్నారని 20 నెలల్లో ఒక్కొక్కరు 40000 నష్టపోయారన్నారు. నెలకు 1000 కోట్లు నష్టమని 20 నెలలు 20 కోట్లు నష్టపోయారన్నారు. పెన్షన్ దారుల రూ.20 కోట్ల ను రైతు రుణమాఫీకి మళ్లించారని, పేదోడు కడుపు కొట్టి పెద్దోలకు పంచారన్నారు. కెసిఆర్ ఫామ్ హౌస్కే పరిమితం అవుతున్నారని, రైతు రుణమాఫీ కోసం మరో రూ.10 కోట్లు ఎప్పుడు ప్రభుత్వానికి ప్రశ్నిస్తున్నారు తప్ప, పెన్షన్ దారులను పట్టించుకున్న పాపను పోలేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు పోటీపడి హామీలు ఇచ్చారన్నారు. ఇచ్చేటోడు ఇవ్వడు అడిగేటోడు అడగడని ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహా గర్జన సన్నాహక సదస్సులు లో పాల్గొంటున్నానని హైదరాబాదులో ఆగస్టు మూడున జరుగు భారీ బహిరంగ సభతో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామన్నారు.



## ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సీఎం

- **హైదరాబాద్‌లో భారీ వర్షా లతో లోతట్టు ప్రాంతాలు జలమయం**
- **ముంపు ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటన**
- **అమీర్‌పేట్ గంగుబాయి బస్తీ, బుద్ధ నగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన**
- **స్థానికులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి**
- **సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ యంత్రాంగం సూచన**

**హైదరాబాద్ ఆగస్టు 10 (సిద్దిపేట పవర్):**

భాగ్యనగరంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. దీనికి తోడు వాతావరణ శాఖ మరోసారి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా రంగంలోకి దిగి, హైదరాబాద్‌లోని నీటి ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి అమీర్‌పేట్‌లోని గంగుబాయి బస్తీ, బుద్ధ నగర్‌తో పాటు పలు లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. భారీ వర్షాల వల్ల రోడ్లపైకి చేరిన మురుగునీటిని, డ్రైనేజీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరద నీటితో తాము పడుతున్న కష్టాలను స్థానికులు ముఖ్యమంత్రికి వివరించారు. వారి సమస్యలను సావధానంగా విన్న రేవంత్ రెడ్డి, వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.

పర్యటన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హైదరాబాద్ కమిషనర్‌ను, సిబ్బందిని ఆదేశించారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు.



## బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**మొదటిపేజీ తరువాయి**

అనుచరులు, నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు కూడా బీజేపీ సభ్యత్వం స్వీకరించారు.

కొన్ని రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినప్పటి నుంచి గువ్వల బాలరాజు ఏ పార్టీలో చేరతారనే దానిపై తీవ్రమైన చర్చ నడిచింది. గతంలో తనపై దాడి జరిగినప్పుడు పార్టీ నాయకత్వం అండగా నిలవలేదని, తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన బీఆర్ఎస్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన పార్టీని వీడగా, తాజాగా బీజేపీలో చేరడంతో ఊహాగానాలకు తెరపడింది.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, దేశవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసి గువ్వల బాలరాజు పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఆయన సేవలను పూర్తిగా వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులు పాల్గొని గువ్వల బాలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.





## రోగనిరోధక శక్తి ఎక్కువైతే పిల్లలకు ముప్పే

- వాస్క్యులైటిస్, ఆర్థరైటిస్, కవాసాకి డిసీజ్‌లు వచ్చే ప్రమాదం
- వీటిని జాగ్రత్తగా గమనించి సత్వర చికిత్సలు అందించాలి
- లేనిపక్షంలో ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం
- ప్రపంచ ప్రఖ్యాత వైద్యనిపుణుడు ప్రొఫెసర్ సుర్జీత్ సింగ్
- కిమ్స్ ఆస్పత్రిలో పీడియాట్రిక్ రుమటాలజీపై సదస్సు

**సికింద్రాబాద్, ఆగస్ట్ 10 ( సిద్ధిపేట పవర్ ):** సాధారణంగా మన శరీరంలో ఉండే రోగనిరోధక శక్తి బయటి నుంచి వచ్చే బ్యాక్టీరియాలు, ఇన్ఫెక్షన్లపై పోరాడుతుంది. కానీ, అది బాగా ఎక్కువైతే.. మన సొంత శరీర అవయవాలనే శత్రువులుగా భావించి వాటి మీద దాడి చేస్తుంది. అప్పుడు ఆ అవయవాలు క్రమంగా క్షీణిస్తాయని ప్రపంచ ప్రఖ్యాత పీడియాట్రిక్ రుమటాలజిస్ట్, ఇమ్యునాలజిస్ట్, చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుర్జిత్ సింగ్ తెలిపారు. ఆదివారం నగరంలోని సికింద్రాబాద్ కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో పీడియాట్రిక్ రుమటాలజీపై జరిగిన సదస్సులో పాల్గొని కీలక ప్రసంగం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....దీనివల్ల వచ్చే వాస్క్యులైటిస్, ఆర్థరైటిస్, కవాసాకి డిసీజ్ లాంటివి అత్యంత ప్రమాదకరం. దురదృష్టకరమైన విషయం ఏంటంటే, పిల్లలకు కూడా ఇవి సోకేందుకు చాలా అవకాశం ఉంటుంది. వాళ్ల విషయంలో తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. తరచు జ్వరం, ఒంటిమీద దద్దుర్లు, దగ్గు, జలుబు లాంటివి వస్తుంటే వెంటనే జాగ్రత్తపడి ఇమ్యునాలజీ నిపుణుల వద్దకు తీసుకెళ్లాలి. లేనిపక్షంలో పిల్లలకు ప్రాణాపాయం సంభవించే ప్రమాదం సైతం ఉందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు గుండె రక్తనాళాల్లో వాపు వచ్చి, గుండె వైఫల్యం సంభవించే అత్యంత ప్రమాదకరమైన కవాసాకి డిసీజ్ అనే వ్యాధి వచ్చిన వారిలో ఇప్పటివరకు వెయ్యి మందికి పైగా పిల్లలకు చికిత్స చేసి, వారి ప్రాణాలను కాపాడిన చరిత్ర ఉన్న ప్రొఫెసర్ సుర్జీత్ సింగ్.. ఈ సదస్సును కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, చీఫ్ నియోనాటాలజిస్ట్, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ బాబు ఎస్. మదార్కర్, పీడియాట్రిక్ ఇమ్యునాలజీ, రుమటాలజీ విభాగం కన్సల్టెంట్ డాక్టర్ అబర్ణా తంగరాజ్, పీడియాట్రిక్స్ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ పరాగ్ శంకర్‌రావు డెకాటే, ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 400 మందికి పైగా వైద్యులు హాజరైన ఈ సదస్సులో ప్రధానంగా పిల్లలకు వచ్చే పలు రకాల సమస్యలు, ముఖ్యంగా రోగ నిరోధక శక్తి ఎక్కువ కావడం, తక్కువ కావడం వల్ల వచ్చే సమస్యలపై కూలంకషంగా చర్చించి, సమగ్ర వివరాలు తెలిపారు. సదస్సులో కిమ్స్ ఆస్పత్రిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ రుమటాలజీ అండ్ క్లినికల్ ఇమ్యునాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వీరవల్లి శరత్ చంద్రమౌళి మాట్లాడుతూ, పిల్లలకు ఏడాది వయసు ఉన్నప్పటి నుంచి సాధారణంగా 15 ఏళ్ల లోపు వరకు ఇలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. వీటి లక్షణాలు తొలుత సాధారణంగానే అనిపిస్తాయి. మామూలు జ్వరం రావడం, ఒంటి మీద దద్దుర్లు, దగ్గు, జలుబు లాంటివి పదే పదే వస్తుంటాయి. వీటిని మామూలు లక్షణాలు అనుకుని వాటికి మాత్రమే చికిత్స చేయిస్తూ వదిలేస్తే చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. అందువల్ల పిల్లల వైద్యులు, జనరల్ ఫిజిషియన్లు కూడా దీనిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. పిల్లలను తల్లిదండ్రులు ఇలాంటి లక్షణాలతో తీసుకొచ్చినప్పుడు వెంటనే పీడియాట్రిక్ క్లినికల్ ఇమ్యునాలజిస్టులు, రుమటాలజిస్టుల వద్దకు పంపాలి. అప్పుడే తగిన పరీక్షల ద్వారా అసలు సమస్య ఏంటన్నది గుర్తించి, దానికి వెంటనే చికిత్స ప్రారంభించేందుకు అవకాశం ఉంటుంది. వీటిలో కొన్నింటికి దీర్ఘకాలం పాటు .. అంటే కొన్ని వారాల తరబడి చికిత్స చేయాల్సి రావచ్చు. ఒక్కో రకం సమస్యకు ఒక్కో తరహా ఇమ్యునో సప్రెసెంట్లు, ఇతర మందులు వాడాల్సి ఉంటుంది అని తెలిపారు. పీడియాట్రిక్ అకాడమీ ఆఫ్ తెలంగాణ స్టేట్ (పాట్స్), ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) జంటనగరాల శాఖ, లిటిల్ వన్స్ క్యూర్ ఫౌండేషన్ సహకారంతో కిమ్స్ కడల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో సీనియర్ కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్, పీడియాట్రీషియన్ డాక్టర్ అపర్ణ సి, ఇంకా డాక్టర్ కె.వి. అనిల్ కుమార్, డాక్టర్ గుమ్మడి అంజని, డాక్టర్ అబర్ణా తంగరాజ్, డాక్టర్ జాస్తి శ్రీరేఖ, డాక్టర్ సంబిత్ సాహు, డాక్టర్ పి. రాకేష్ కుమార్ పాల్గొన్నారు.

## దళిత మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి క్షమాపణ చెప్పాలి!

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు:10 ప్రతినిధి**

దళిత మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దిష్టిబొమ్మ ను కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో బస్టాండ్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దుబ్బాక పి ఎ సి ఎస్ వైస్ చెర్మన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ లు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పటికీ దుబ్బాక నియోజకవర్గంకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయని కొత్త ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శలకు దిగడం జరుగుతుందని విమర్శించారు. ఎంపీగా 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు దుబ్బాక నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని బహిరంగంగా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.కేవలం కొంతమంది నాయకులకే తొత్తుగా వ్యవహరించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దళిత మంత్రులపై,కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.అనంతరం ప్రభాకర్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు నర్మేట యేసురెడ్డి,మండల అధ్యక్షుడు కొంగర రవి,శ్రీ రామలింగేశ్వర స్వామి చెర్మన్ రాజిరెడ్డి,యూత్ జనరల్ సెక్రటరీ ఆకుల భరత్,తునికి సురేష్,,మండల ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, మట్టా కిషన్ రెడ్డి,పర్శరాములు,దేవుని రాజు, గడ్డం శ్రీనివాస్ గౌడ్,మాజీ సర్పంచ్లు గడీల జనార్దన్ రెడ్డి, గుండా శంకర్,చెక్కపల్లి పద్మయ్య, ఏలూరి కమలాకర్, బీమ్ రావు, వెంకటాచారి,మహిళా నాయకురాలు లక్ష్మీ,తదితరులు పాల్గొన్నారు.



# రాయలసీమ ఎత్తిపోతల పూర్తయితే ఖమ్మం, నల్గొండ ఎడారులే

- రాయలసీమలో లిఫ్ట్ పూర్తి అయితే నల్గొండ, ఖమ్మం జిల్లాలకు భారీ నష్టం
- రాయలసీమ లిఫ్ట్‌ను ఆపేయాలి
- కృష్ణా జలాలను తెలంగాణ 1 టీఎంసీ వాడుకుంటే.. ఏపీ 11 టీఎంసీలు వాడుకుంటోంది
- అదే జరిగితే శ్రీశైలం ఖాళీ అవుతుంది
- సీఎం రేవంత్, ఉత్తమ్ ఇద్దరూ బనకచర్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారు
- అందుకే బనకచర్ల ఆగిపోయింది. -భట్టి విక్రమార్క

**హైదరాబాద్ ఆగస్టు 10 (సిద్ధిపేట పవర్):** మధిర నియోజకవర్గ పరిధిలోని వంగవీడులో రూ. 630.30 కోట్ల వ్యయంతో జవహర్ ఎత్తిపోతల పథకం శంకుస్థాపన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రధాన అతిథిగా పాల్గొనగా, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రావు తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ రైతులు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోని సాగర్ కాలువల నుంచి నీరు పొందాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. మధిర నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని ఏరు దాటుతున్నా, ఆ నీరు వృథా అవుతోంది. ఉద్యమాల సమయంలో ఇది చేయలేక పోయాం, కానీ పదేళ్ల TRS పాలనలో ఒక్క చుక్క నీటినీ సద్వినియోగం చేయలేదన్నారు.

ఉమ్మడి రాష్ట్ర కాలంలో ప్రారంభమైన ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, ముఖ్యంగా జలిముడి ప్రాజెక్ట్ పట్ల BRS ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని ఆయన విమర్శించారు. దయలేని BRS పాలన తర్వాత, ఇంద్రమ్మ రాజ్యం రాగానే ఈ పథకానికి మోక్షం లభించింది. మూడో జోన్‌లో 35 వేల ఎకరాలకు నీరు అందించేందుకు ఈ ప్రాజెక్ట్ దోహదం చేస్తుంది అని భట్టి విక్రమార్క తెలిపారు.

అంతేకాకుండా.. సాగర్ మూడో జోన్ మొత్తం రెండో జోన్‌లో కలిసేలా రూపకల్పన చేస్తున్నాం. ఖమ్మం జిల్లా మొత్తం సాగర్ నీటిపైనే ఆధారపడి ఉంది. మనం కేవలం 1 TMC కృష్ణా నీటిని వాడుకుంటుంటే, ఆంధ్రప్రదేశ్ వారు 11 TMCల నీటిని వినియోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది జరిగితే శ్రీశైలం ఖాళీ అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.



బనకచర్ల ప్రాజెక్ట్‌కి వ్యతిరేకంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పోరాడి ఆ ప్రాజెక్ట్‌ను ఆపారని తెలిపారు. రాయలసీమ లిఫ్ట్ పూర్తి అయితే నల్గొండ, ఖమ్మం జిల్లాలకు నష్టం జరుగుతుందని హెచ్చరిస్తూ, దానిని ఆపేందుకు మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. పోలవరం ముంపు భూములను తెలంగాణకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్ల ప్రాజెక్ట్‌ను అంగీకరించబోం. యావత్ కేబినెట్ బనకచర్ల వ్యతిరేక పోరాటంలో ముందుంటుంది అని స్పష్టం చేశారు.

జవహర్ ఎత్తిపోతల పథకం పూర్తి అయితే, మధిర నియోజకవర్గ రైతులకు సాగునీటి సమస్య పరిష్కారమవుతుందని, పంటల ఉత్పాదకత పెరిగి ఆర్థికంగా రైతులు లాభపడతారని తెలిపారు.

## సిద్ధిపేటలో రౌడీ రాజ్యం నడుస్తుంది..

- మైనంపల్లికి సిద్దిపేటకు ఏం సంబంధం
- నా లాంటి బీసీ లీడర్లను ఎదగకుండా తొక్కేస్తున్నారు..
- కోవర్ట్ రాజకీయాలు భరించలేక కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నా..
- కాంగ్రెస్ పార్టీ నాయకులు చక్రధర్ గౌడ్..

**సిద్దిపేట ఆగస్ట్10(సిద్దిపేట పవర్)**

సిద్ధిపేటలో రౌడీ రాజ్యం నడుస్తుందని, మైనంపల్లికి సిద్దిపేట తో ఏం సంబంధం ఉందని వందల మందితో సిద్దిపేట కు వచ్చి భూ దందాలు చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ నాయకులు చక్రధర్ గౌడ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మైనంపల్లి లాంటి నాయకులు తన లాంటి బీసీ లీడర్లను ఎదగకుండా తొక్కేస్తున్నారని అన్నారు. పార్టీలోని కోవర్ట్ రాజకీయాలు భరించలేక కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం తన పై పెట్టిన ఫేక్ కేసులను, కాంగ్రెస్ పార్టీ కి చెందిన వారే ఇప్పుడు సోషల్ మీడియా లో పెడుతూ తన ప్రతిష్ట కు భంగం కలిగిస్తున్నారని అన్నారు. పార్టీలో తనతో పాటు తిరుగుతున్న వారికి ఏ ప్రభుత్వ పథకాలను అందకుండా చేస్తున్నారని, తాను ఏ రోజు పదవులను ఆశించకుండా పార్టీ కోసం కష్టపడ్డానని, అలాంటి తనను వ్యక్తిగతంగా తన తల్లి పేరుతో మైనంపల్లి దూషించాడని ఆవేదనb వ్యక్తం చేశారు. గతంలో తండ్రి కొడుకులు కేటీఆర్ కాళ్లు మొక్కి ఆయనను తిట్టారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కాళ్లు మొక్కుతున్నారని, అవసరం తీరితే ఆయనను కూడా తిడతారన్నారు. మైనంపల్లి ఎక్కడ అడుగు పెడితే అక్కడ డీసీసీ లు రాజీనామా చేస్తున్నారని, ఆయన చెప్పినట్టు వినకపోతే వాళ్లంతట వాళ్లే పార్టీలో నుండి వెళ్లేలా పుల్లలు పెడుతున్నాడని అన్నారు సిద్దిపేట పట్టణంలో సర్వే నెంబరు 2000 లో బిఆర్ఎస్ లీడర్ ఆలకుంట మహేందర్ రైతుల భూమిని కబ్జా చేస్తే అలాంటి అతన్ని కూడా పార్టీలోకి తీసుకొని, అతనికి సపోర్ట్ చేస్తూ, నిజమైన అర్హులైన వారికి అన్యాయం చేయడం దారుణం అన్నారు. మిట్టపల్లి గ్రామానికి చెందిన రైతు డబ్బులు పోతే కేసు పెడితే కూడా చలనం లేని పోలీసులు, కబ్జా స్థలం విషయం లో నిజమైన పట్టదారులు గోడను కులిస్తే కేవలం 2 గంటల్లో డబ్బులు, బంగారం దొంగిలించారని కేసు ఎలా చేశారని అన్నారు. పార్టీలో నిజమైన కాంగ్రెస్ నాయకులకు విలువ లేదని, బిఆర్ఎస్ నుండి వలస వచ్చిన నాయకులకే పనులు అయితవున్నాయన్నారు. కొద్దీ రోజుల్లోనే మైనంపల్లి తీరు వల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కాళీ అయితుందని, మైనంపల్లి సిద్దిపేట జిల్లా లో ఎన్ని సర్పంచ్, ఎంపీటిసి, జడ్పీటీసీ లు గెలిపిస్తారో చెప్పాలని అన్నారు. కబ్జా కోరులకు వత్తాసు పలికిన సిద్దిపేట వన్ టౌన్ సీఐ ని కోర్ట్ లో నిలబెడుతానన్నారు. ఇందిరమ్మ ఇల్లు కావాలంటే డబ్బులు అడుగుతున్నారని, సీఎం సిద్దిపేట మీద ప్రత్యేక దృష్టి పెట్టి ఇక్కడి ఇంచార్జీని మారిస్తే తప్ప పార్టీ బాగుపడదు అన్నారు..



## మీకు మేము ఉన్నామని...

**ఫుట్ పాత్ అనాధలకు రాఖీలు కట్టిన ఫౌండేషన్ మెంబర్స్**

**సికింద్రాబాద్, ఆగస్టు 10 (సిద్ధిపేట పవర్):** హైదరాబాద్ సిటీలోని ప్రధాన రహదారుల పక్కన ఫుట్ పాత్ లపై దుర్భర జీవనం గడుపుతున్న అనాధలకు, నిరాశ్రయులకు మేము ఉన్నాము.. అని స్కై ఫౌండేషన్ ఆర్గనైజర్లు సోదర భావంతో అండగా నిలిచారు. రక్షాబంధన్ పండుగ సందర్భంగా అందరూ వేడుకలు చేసుకుంటుంటే, ఏ పండుగ.. వేడుకలను జరుపుకోలేని అనాధల వద్దకు వెళ్లిన వీరు మీకు మేము ఉన్నామని అంటూ ఫౌండేషన్ వాలంటీర్లు వారికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి స్వీట్లు అందచేసి నోరు తీపి చేశారు.



**స్కై 282 వ అన్నదానం:**

సిటీలోని ప్రధాన రహదారుల వెంట ఆదివారం పర్యటించిన ఫౌండేషన్ నిర్వాహకులు తమ 282 వ అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ వై సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ పావని, వాలంటీర్లు పాల్గొన్నారు

## నేడే సోమవారం మాల అమరవీరుల సంస్కరణ సభ జయప్రదం చేద్దాం

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 9 ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ కు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆగస్ట్ 11 న మాల అమరవీరుల సంస్కరణ సభ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పిలుపు మేరకు దుబ్బాక మాల మహానాడు ఆధ్వర్యంలో ఆగస్టు 11 న మాల అమరవీరుల సంస్కరణ సభ నిర్వహించాలని తెలుపడం జరుగుతుంది ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిరంకుశంగా పాశవికంగా జరిపిన దాడిలో ప్రాణాలు కోల్పోయినస్వర్గీయ పీవి రావు . మరియు పాశంగి శేషయ్య గాపతోటి నారాయణ రెడ్డి సత్యనారాయ లతో పాటు ఉద్యమములో ప్రాణాలు కోల్పోయిన పీ.వీ.రావు ప్రాణాలు కోల్పోయిన మాల అమర వీరులకు దుబ్బాక మాల మహానాడు అధ్యర్యంలో రేపు ఉదయం 11 గంటలకు స్థానిక దుబ్బాక బస్టాండ్ వద్ద ఘన నివాళులర్పించడం జరుగుతుంది వారీ త్యాగాలను స్మరించుకోవాలని కోరుచున్నాను రేపు ఉదయం దుబ్బాక మండలం మాల మహానాడు అంబేద్కర్ సంఘాల సోదరులందరూ పాల్గొనగలరు కాల్వ నరేష్ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా కార్యవర్గ సభ్యులు.జాతీయ మాల మహానాడు. .తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చేర్మెన్ ర్యాకం శ్రీరాములు. దుబ్బాక అంబెద్కర్ సంఘము అధ్యక్షులు.. కాల్వ లింగం ప్రధాన కార్యదర్శి అస రాజశేఖర్. గౌరవ కౌన్సిలర్ లు..అస యాదగిరి. అస స్వామి. బత్తుల.స్వామి అస సులోచన స్వామి. *రూరల్ మండలం మాలమహానాడు. నాయకులు. తాజా మాజీప్రజాప్రతినిధులు దుబ్బాక మండలంలోని వివిధ గ్రామాల అంబెద్కర్ సంఘము అధ్యక్షులు. ప్రతి ఒక్కరు రేపు ఉదయం 11గంటలకు దుబ్బాక బస్టాండ్ ఆవరణలో జరిగే మాల మృత వీరుల దినోత్సవం లో పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు ర్యాకం. శ్రీరాములు.మాలమహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చేర్మెన్ ర్యాకం శ్రీరాములు ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో విచ్చేసి మాల అమరవీరులకు నివాళులు అర్పించడమే జాతి పరంగా నారా చంద్రబాబు నాయుడు మరొకసారి సీఎం కాకుండా మన వేదిక పై నుండి మనలంటే అమ్మో బాబు చెంప దెబ్బ కలిగే విధంగా వద్దామని ఆయన పిలుపునిచ్చారు మాలలు అంటే రాష్ట్రప్రభుత్వాలు చూస్తున్న తరుణంలో నేడు దుబ్బాక నుంచి మొదలుకొని ఢిల్లీ దాకా సౌండ్ వినిపించి మన సత్తా సాటడమే మన లక్షణం అని ఆయన అన్నారు



## నేడే దుబ్బాకలోమాల సంస్కరణ సభ విజయవంతం చేయండి

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ప్రతినిధి ఆగస్టు 10 ప్రతినిధి**

కాల్వ నరేష్ తెలంగాణ మాల సోషల్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆగస్ట్ 11 న మాల అమరవీరుల సంస్కరణ సభ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పిలుపు మేరకు దుబ్బాక మాల మహానాడు ఆధ్వర్యంలో ఆగస్టు 11 న మాల అమరవీరుల సంస్కరణ సభ నిర్వహించాలని తెలుపడం జరుగుతుంది ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిరంకుశంగా పాశవికంగా జరిపిన దాడిలోప్రాణాలు కోల్పోయిన పాశంగి శేషయ్య గాపతోటి నారాయణ రెడ్డి సత్యనారాయ లతో పాటు ఉద్యమములో ప్రాణాలు కోల్పోయిన పీ.వీ.రావు ప్రాణాలు కోల్పోయిన మాల అమర వీరులకు దుబ్బాక మాల మహానాడు అధ్యర్యంలో రేపు ఉదయం 11 గంటలకు స్థానిక దుబ్బాక బస్టాండ్ వద్ద ఘన నివాళులర్పించడం *జరుగుతుంది వారీ త్యాగాలను స్మరించుకోవాలని కోరుచున్నాను రేపు ఉదయం దుబ్బాక మండలం మాల మహానాడు అంబేద్కర్ యువజనసంఘాల సోదరులందరూ అధిక సంఖ్యలో వచ్చి అమరులకు నివాళులు అర్పించాలని వారు కోరారు





## కులం పేరుతో దూషించి,దాడి చెసిన తూముకుంట నర్సారెడ్డి ని అరెస్టు చేయాలి

**రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కు దళిత సంఘాల అధ్వర్యంలో దళిత నేత కొమ్ము విజయ్ కుమార్ విన్నపం**

**సిద్ధిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** ప్రభుత్వ రేషన్ కార్డు ల పంపిణీ కార్యక్రమం లో కాంగ్రెస్ దళిత నేత కొమ్ము విజయ్ పై దాడి చేసి, కులం పేరుతో దూషించిన మాజీ ఎమ్మెల్యే టి. నర్సారెడ్డి ని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కు దళిత సంఘాల అధ్వర్యంలో బాధితుడు కొమ్ము విజయ్ విన్నవించారు.ఆదివారంనాడు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను తన నివాసం లో కలిసి వినతిపత్రం సమర్పించారు. తన ఎదుగుదల ఓర్వలేకనే తన పై నర్సారెడ్డి దాడి చేశాడని అయనను అరెస్టు చెసి కఠినంగా శిక్షించి తనకు న్యాయం వేయాలని కోరారు. ఇందుకు స్పందించి న చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా పోలీస్ కమిషనర్,గజ్వేల్ ఎసిపిలకు పొన్ చేసి విజయ్ పై దాడి పై ఆరా తీశారు. నర్సారెడ్డి పై నమోదైన అట్రాసిటి కేసు విచారణను వేగవంతం చేసి చర్యలు తీసుకొవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, దళిత రత్న అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత పొన్నాల కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ముం ద్రాతీ కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జగదే వపూర్ మండల కమిటీ అధ్యక్షుడు పోసాన్ పల్లి రాజు,డిబిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజివ్ తదితరులు పాల్గొన్నారు.





## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 9 ప్రతినిధి**

దుబ్బాక మండలం పరిధిలోని మండలంలోని పెద్దచీకోడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందన బాధిత కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గజభింకర్ కృష్ణాజి మృతి చెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్సీ షారుఖ్ హుస్సేన్ పరామర్శించి వారి కుటుంబాలకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. తనకు పరిచయం ఉన్న వ్యక్తులు ప్రజా ప్రతినిధులు పేదలు ఎవరైనా మృతి చెందిన విషయం తెలుసుకొని వెంటనే ఆయా గ్రామాలకు వెళ్లి పరామర్శించి తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. తనకు పదవి ఉన్నా లేకున్నా దుబ్బాక ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమే ప్రధాన లక్ష్యమన్నారు. పేదలకు ఎలాంటి ఆపద సంపద ఉన్న వారి వెన్నంటే ఉంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ తౌడ శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్ నాయకులు నవీన్ తదితరులున్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు

**జనంతోడు నంగునూరు ఆగస్టు 10:** నంగునూర్ మండలం లో కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పరామర్శించారు కొనాయ్ పల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదం లో తీవ్ర గాయాలు కాగ విషయం తెల్సుకున్న హరీష్ రావు ఇంటికి వెల్లి పరామర్శించారు, అధైర్య పడొద్దని మనో ధైర్యాన్ని ఇచ్చారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త నక్క లింగం ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి ని తెలియజేశారు కుటుంబానికి అండగా ఉంటానని అన్నివిధాలుగా ఆదుకుంటానని భరోసానిచ్చారు.. పాలమాకుల గ్రామానికి చెందిన రంగు రమేష్ తండ్రి ఇటీవల అనారోగ్యం తో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు వీరి వెంట అదే ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అనగోని లింగం గౌడ్ కోల రమేష్ గౌడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు ఎడ్ల సోమిరెడ్డి రాగుల సారయ్య పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి దుంబాల శ్రీనివాస్ గౌడ్ వేణు చక్రవర్తి అజీజ్ కోటిరెడ్డి సంతోష్ రెడ్డి ఐలయ్య కుమార్ పలువురు ఉన్నారు



# ప్రజల గుండెల్లో నిలిచేది గులాబీ జెండానే.

- ప్రజల గుండెల్లో నిలిచేది గులాబీ జెండానే.
- మళ్ళీ కెసిఆర్ రావాలి.. కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.
- కెసిఆర్ నాయకత్వం లో అన్ని వర్గాలకు న్యాయం..
- అభివృద్ధి.. సంక్షేమం లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపాం..
- కాంగ్రెస్ ప్రభుత్వం లో అన్ని వర్గాలు అసంతృప్తి..
- ప్రతి వార్డ్ లో పార్టీ కార్యాలయాలు..
- పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటాం..
- 20 వార్డ్ లో కాంగ్రెస్ పార్టీ నుండి బి ఆర్ ఎస్ పార్టీ లో చేరికలు.
- సిద్దిపేట పట్టణం లోని 20 వార్డ్ లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. -



**సిద్ధిపేట పవర్:**

తెలంగాణ రాష్ట్ర ప్రజలు లకెసిఆర్ రావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు సిద్దిపేట పట్టణం లో 20 వార్డ్ లో పార్టీ కార్యాలయం ను ప్రారంభించారు ఈ ఈ సందర్బంగా ప్రజల గుండెల్లో నిలిచేది గులాబీ జెండానే అని, కెసిఆర్ నాయకత్వం లో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు అభివృద్ధి.. సంక్షేమం లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత కెసిఆర్ గారిదేనని చెప్పారు.. కాంగ్రెస్ ప్రభుత్వం లో అన్ని వర్గాలు అసంతృప్తి మళ్ళీ కెసిఆర్ రావాలి.. కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.. ప్రతి వార్డ్ లో పార్టీ కార్యాలయాలు పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.. ఈ సందర్బంగా బి ఆర్ ఎస్ పార్టీ లో పలువురు చేరారు మహ్మమద్ ఇంతియాజ్, అజిమోద్దీన్, రెహాన్, ఆరిఫ్, మోహిన్, సల్మాన్, నవాజ్, ఖాజా పాషా, రహీం లకు పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.





## ప్రశాంత్ నగర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పేరుడి వెంకటరెడ్డి

**సిద్దిపేట, ఆగస్టు 10:**



ప్రశాంత్ నగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నికల్లో పేరుడి వెంకటరెడ్డి ఘన విజయం సాధించారు. ఆయన ఫ్యానల్ మొత్తం కూడా గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా మారెడ్డి మల్లికార్జున రెడ్డి, దర్పల్లి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోనెపల్లి బాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా మూర్తి అశోక్ రెడ్డి, పాతూరి అశోక్ రెడ్డి, కోశాధికారిగా గిజివెల్లి వెంకటేశ్వర్ రెడ్డి, ప్రచార ప్రచార కార్యదర్శులుగా మార్పుల నారాయణ రెడ్డి, చిలుకోటి శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వట్టిపల్లి రాజిరెడ్డి, రామవరం రవీందర్ రెడ్డి, వల్లపురెడ్డి రవికిరణ్ రెడ్డి, బత్తుల శ్రీనివాస్ రెడ్డి, లింగాల రాజలింగా రెడ్డి లు గెలుపొందారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో గెలిపించిన రెడ్డి సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



## కాంగ్రెస్లో వర్గపోరు.. మైనంపల్లి చిచ్చు పెడుతున్నారా?



**సిద్ధిపేట పవర్:** రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్లో చేరిన మైనంపల్లి హనుమంతరావు సిద్దిపేట జిల్లాలో వర్గాలను ప్రోత్సహిస్తున్నట్లు చర్చ సాగుతోంది. గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో విభేదించే వర్గాన్ని ప్రోత్సహిస్తున్నట్లు వినిపిస్తోంది. దీంతో నర్సారెడ్డి ఈ విషయంలో గుర్రుగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు సిద్దిపేటకు చెందిన నేత చక్రధర్ గౌడ్ మైనంపల్లి తీరుతోనే తాజాగా రాజీనామా చేసినట్లు చెప్పారు. ఇటీవల మెదక్ నుంచి పలువురు నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో మైనంపల్లి తీరుతోనే ఇదంతా జరుగుతోందని చర్చించుకుంటున్నారు.

## అమర్నాథ్ సేవా సభ్యులకు హరీష్ రావు సన్మానం

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేటలో మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా అమర్నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులకు ఆదివారం సన్మానం జరిగింది. జూలై 3 నుండి ఆగస్టు 3 వరకు అమర్నాథ్ గుహ, బాల్తాల్ లంగర్ 8లో అన్న ప్రసాద వితరణ చేసిన సేవకులకు ఈ గౌరవం దక్కింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, కడవేర్గు రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## 42 శాతం బి సి రిజర్వేషన్ లను ఆమోదించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్
- సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ చెమన్ వద్ద ధర్నా

**సిద్ధిపేట ఆగస్టు 10:** తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ లో చట్టం చేయాలని జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట పాత బస్టాండ్ అంబేద్కర్ చెమన్ లో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి మల్లారెడ్డి మాట్లాడుతూ బిజెపి అనుసరిస్తున్న ద్వంద వైఖరిని అనుసరిస్తుందని బిజెపి పాలిత రాష్ట్రాలలో ఒక న్యాయం తెలంగాణలో ఒక న్యాయమా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ తీసుకువచ్చి గవర్నర్ కు పంపిస్తే ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించారన్నారు. ఈ బిల్లును ఆమోదించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీలకు రిజర్వేషన్లు లేకుండా బిల్లు పంపిస్తే ఆమోదిస్తామని మతవైశ్యమ్యాలు సృష్టించే విధంగా ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లకు మతానికి లింకు పెట్టడం పట్ల బిజెపి నిజస్వరూపం తన మతోన్మాద ఎజెండా ప్రజలకు అర్థమవుతుందన్నారు. మైనార్టీలలో అట్టడుగులున్నటువంటి సంచార జాతులు ఎలాంటి ఉపాధి లేని నిరుపేదలకు మాత్రమే బీసీ రిజర్వేషన్ ఉందని ఈ సాకుతో మైనార్టీలలో ఉన్న పేదలను మరింత పేదలుగా మార్చే విధంగా బిజెపి వ్యవహరిస్తుందన్నారు. ఈ విధానం రాజ్యాంగానికి, లౌకిక విధానానికి వ్యతిరేకమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీసీల పట్ల అనుసరిస్తున్న ద్వంద వైఖరిని వినవాడాలని ప్రజలు ముక్తకంఠంతో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. వెంటనే 42 శాతం బీసీ రిజర్వేషన్ ను తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపే రాజకీయ పార్టీలన్నింటితో సమావేశం నిర్వహించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవడం మూలంగా గ్రామ పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, అభివృద్ధి కుంటుపడిందని మండి పడ్డారు. కనీస సౌకర్యాలు కూడా ప్రజలకు అందడం లేదని, కేంద్రం నుండి రావలసిన నిధులు ఆగిపోయాయని దీనివలన తెలంగాణకు తీవ్ర నష్టం చేకూరే అవకాశం ఉందన్నారు. వెంటనే 42 శాతం రిజర్వేషన్లు ఆమోదించి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రిజర్వేషన్లు అమలు కోసం పెద్ద మహోద్యమం నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామిని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు సింగిరెడ్డి నవీన, దాసరి ప్రశాంత్, నాయకులు సంధింటి రంగారెడ్డి, ఇప్పకాయల శోభ, కొండం సంజీవ్, వంగ రవీందర్ రెడ్డి, బత్తుల అభిషేక్ బాను, కొమ్ముల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## అహ్మదిపూర్ పి హెచ్ సి ని జిల్లా కలెక్టర్ హైమవతి ఆకస్మిక తనిఖీ

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:**

గజ్వేల్ మండలం అహ్మదీపూర్ పి హెచ్ సి ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హైమావతి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణ అలసత్వ వహించిన భాద్యత రహితంగా వ్యవహరించిన కఠిన చర్యలు వహించాల్సి వస్తుందని తెలిపారు. వారితో పాటుగా పి హెచ్ సి సిబ్బంది తదితరులు ఉన్నారు.

